నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ సమర్థ నారాయణ విద్యుత్ ఫీడర్ పరిధిలోని సమర్థ నారాయణ, సంజయ్‌నగర్, ఎంసీహెచ్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే గోశాల, నల్ల పోచమ్మ ఆలయం విద్యుత్ ఫీడర్ల పరిధిలోని శివాజీ విగ్రహం, హత్తీ బౌలి, పోలీస్ క్వార్టర్స్, ఇమామ్‌పురా, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సన్మానం



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న దృశ్యం

అఫ్జల్‌గంజ్: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు తూమ్‌కుంట అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం చేశారు. ఆయనను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ..ఇందిరమ్మ రాజ్యంలోనే బడుగు, బలహీన వర్గాలతో పాటు అన్నివర్గాల సంక్షేమం కొనసాగుతుందన్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం



లంగర్‌హౌస్: గోల్కొండ కోట బోనాలు ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సాయిబాబాచారి ఆహ్వానించారు. బోనాల సందర్భంగా గోల్కొండలోని తమ నివాసం నుంచి కోటపైకి ఎల్లమ్మ అమ్మవారి ఊరేగింపు ఉంటుందని, మధ్యాహ్నం ఊరేగింపు ప్రారంభం కానుండగా ఈ పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కవితను ఆహ్వానించామన్నారు. ఆమెను కలిసిన వారిలో శ్రీకాంత్‌చారి, శివచారి, మల్లేష్‌చారి తదితరులున్నారు.

మహంకాళేశ్వర ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడిగా విజయానందరావు



చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడిగా చలువాది విజయానందరావు నియమితులయ్యారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులైన ఆయన గతంలో భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీకి ఉపాధ్యక్షుడుగా, మీరాలంమండి ఆలయ కమిటీకి కూడా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఈ ఏడాది జరిగే ఆషాఢ మాసం బోనాలకు ఆలయ కమిటీ తరఫున తిరిగి ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆదేశాల మేరకు ఈసారి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



కృష్ణ

అబిడ్స్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ మజ్దూర్ సంఘ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న కృష్ణ ఆల్ ఇండియా భారతీయ మజ్దూర్ సంఘ్ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ..జీహెచ్ఎంసీతో పాటు అన్ని ప్రాంతాల్లో ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బీఎంఎస్ ఉద్యోగుల ప్రగతికి, సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. అందరితో కలిసిమెలిసి అండగా ఉండి వారి శ్రేయస్సుకు కృషి చేస్తామన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జియాగూడ: కార్వాన్ బంజావాడిలోని శివ పంచాయతన బాలాంజనేయ స్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవ ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఆంజనేయస్వామికి చందన పూజ, హారతులు, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం గురు మదనానంద సరస్వతి పీఠాధీశ్వరులు మాధవానంద సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో నిర్వహిస్తున్నారు.

అద్భుత కళాఖండాలకు నిలయం..

సాలార్‌జంగ్ మ్యూజియం

- సాలార్‌జంగ్ అనేది నిజాం ఇచ్చిన బిరుదు
- మూడో సాలార్‌జంగ్ సేకరించిన వస్తువులతో మ్యూజియం



సాలార్‌జంగ్ మ్యూజియం భవనం

చార్మినార్: అద్భుత కళాఖండాలకు నిలయం.. సాలార్‌జంగ్ మ్యూజియం.. పాలరాతి శిల్పాలు, ఏనుగు దంతాల కళాకృతులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. సాలార్‌జంగ్ మ్యూజియం నయాపూల్-దారుషిఫా రోడ్డులో ఉంది. ఇది మన దేశంలోని ప్రసిద్ధిగాంచిన మ్యూజియాలలో మూడవది. మొదట ఈ మ్యూజియాన్ని దివాన్‌దేవిడీలో 1951 డిసెంబర్ 16న అప్పటి ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించి అద్భుత కళాఖండాలను దేశ ప్రజలకు అందించారు. మీర్ తురబ్ అలీ ఖాన్, మీర్ లాయక్ అలీ ఖాన్, మీర్ యూసఫ్ అలీ ఖాన్ బహదూర్ సేకరించిన వస్తువులతో సాలార్‌జంగ్ మ్యూజియంను ఏర్పాటు చేశారు. మూడో సాలార్ జంగ్ అయిన మీర్ యూసఫ్ అలీ ఖాన్ బహదూర్ నిజాం ప్రభువుల వద్ద ప్రధాన మంత్రిగా విధులు కొనసాగించారు. సాలార్‌జంగ్ అనేది నిజాం ప్రభువులు ఇచ్చిన బిరుదు.

36 దేశాల నుంచి సేకరించిన వస్తువులు..

మీర్ యూసఫ్ అలీ ఖాన్‌కు వస్తువులను సేకరించడమంటే ఎంతో ప్రీతి. ఐరోపా, మధ్య ఆసియాలోని 36 దేశాల నుంచి ఆయన సేకరించిన సుమారు 43 వేల వస్తువులను, దాదాపు 50 వేలకు పైగా పుస్తకాలను, తాళపత్ర గ్రంథాలను సాలార్‌జంగ్ మ్యూజియంలో పర్యాటకుల సందర్శనార్థం ప్రదర్శనకు ఉంచారు. వీటిలో 30 శాతం వరకు కళాఖండాలే. 1876లో ఇటలీ శిల్ప కళానైపుణ్యంతో రూపుదిద్దుకున్న రెబెకా, 19వ శతాబ్దంలో ఇంగ్లాండ్ నుంచి తీసుకువచ్చిన మ్యూజికల్ గడియారం, ఫ్రాన్స్ నుంచి 1876లో సేకరించిన మెఫిస్టోఫెలస్-మార్గరెట్టా (డబుల్ స్టాచ్యు)విగ్రహాలు ముఖ్యమైనవి. ఇవేకాకుండా దంతపు కుర్చీలు, దంతాలను దారాలుగా తీసి అల్లిన చాప, వజ్ర వైఢూర్యాలు పొదిగిన కత్తులు, గాజు వస్తువులు..ఇలాంటి ఎన్నో అద్భుత కళాఖండాలకు నిలయం సాలార్‌జంగ్ మ్యూజియం.



మ్యూజియంలోని పాలరాతి కళాఖండం



మెఫిస్టోఫెలస్,మార్గరెట్టా (డబుల్ స్టాచ్యు) విగ్రహం

ఎన్నెన్నో అద్భుత కళాఖండాలు..

సాలార్‌జంగ్‌లు సేకరించిన వస్తువుల్లో ఎక్కువ భాగం కొన్నవి కాగా, మరికొన్ని బహుమతులుగా అందుకున్నవి. అందులో ప్రధానమైనది మేలి ముసుగు సుందరాంగి రెబెకా. మ్యూజికల్ గడియారాన్ని సేకరించింది మాత్రం మొదటి సాలార్ జంగ్ మీర్ తురాబ్ అలీఖాన్. వీటితో పాటు 14, 15, 16వ శతాబ్దాలకు చెందిన విగ్రహాలు ఉన్నాయి. రెబెకా విగ్రహాన్ని ఇటలీ శిల్పి రూపొందించగా, మ్యూజికల్ గడియారానికి సంబంధించిన వస్తువులను ఇంగ్లాండ్ నుంచి తీసుకొచ్చి కోల్‌కతాలో బిగించారు. ఇవే కాకుండా ఫ్రాన్స్‌కు చెందిన 16వ థాయి టిప్పుసుల్తానుకు బహూకరించిన దంతపు కుర్చీలు ఉన్నాయి. వీటిలో టిప్పుసుల్తాన్ తన వస్తువులపై వాడే పెద్దపులి నమూనా కూడా ఉంటుంది. ఫ్రాన్స్‌కు చెందిన ఒకే విగ్రహంలో రెండు రూపాలుగా మలిచిన మెఫిస్టోఫిలస్-మార్గరెట్టా విగ్రహం అందాల్ని చూడాల్సిందే తప్ప వాటిని వర్ణించలేం.

ఎలా వెళ్లాలి..

- నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి రోడ్డు మార్గం ద్వారా చక్కటి రవాణా (ఆర్టీసీ) సౌకర్యం కలదు.
- నాంపల్లి, కాచిగూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల ద్వారా వచ్చి రోడ్డు మార్గంలో మ్యూజియం చేరుకోవచ్చు.
- శంషాబాద్‌లోని విమానాశ్రయంలో దిగి పాతబస్తీ ద్వారా రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు.

సందర్శన సమయం..

- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.

టికెట్ రేట్లు..

పెద్దలకు: రూ.20
చిన్నారులకు: రూ. 10
(18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు)
విదేశీయులు: రూ.500

సెలవు..

ప్రతి శుక్రవారం సెలవుతో పాటు జాతీయ సెలవుల్లో కూడా మ్యూజియం సందర్శన మూసి ఉంటుంది.

చిన్నారులను సంగీత కళల్లో ప్రోత్సహించాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాధిక సంగీత నృత్య అకాడమీ సంయుక్తాధ్వర్యంలో 'నెల నెలా కళారాధన'39వ సంచికను సోమవారం రవీంద్రభారతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాష, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..పాఠశాల స్థాయి నుంచి చిన్నారులను సంగీత, నృత్య ప్రదర్శనల్లో ప్రోత్సహించాలన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ శేషులత విశ్వనాథ్ మాట్లాడుతూ..గత 39 సంచికల నుంచి సంగీత కళా రంగంలో చిన్నారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అంతకు ముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కర్ణాటక సంగీత గురువు బోనాల రాధాకృష్ణ శ్రీ అన్నమాచార్య ఆర్ట్స్ అకాడమీ గురువు పసుమర్తి సాయి నర్సింహాయాదవ్, అకాడమీ వ్యవస్థాపకురాలు రమణి సిద్ధి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో ప్రొఫెసర్ శేషులత తదితరులు

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి



వినతి పత్రాన్ని అందజేస్తున్న శ్రీనివాస్

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ మండల పరిధిలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ కేటాయించాలని భాగ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కానుగుల శ్రీనివాస్ కోరారు. సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..1999లో 500 మందికి పైగా ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోగా కలెక్టర్ సోషల్ ఎకనామికల్ సర్వే చేయించి అందులో 324 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. వీరికి బండ్లగూడ మండల పరిధిలోని సర్వే నంబర్ 83లో పట్టాలు మంజూరు చేయడం కూడా జరిగిందన్నారు. ఆ భూమి వివాదంలో ఉండడంతో అప్పట్లో పొజిషన్ ఇవ్వకపోవడం, అనంతరం మరోసారి సర్వే నిర్వహించి 2005లో 181 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. కానీ కాలక్రమేణా కేవలం 35 మందికి మాత్రమే ఇళ్లను కేటాయించడం సరైంది కాదన్నారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం మిగిలిన వారందరికి ఇళ్లను కేటాయించాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న జగదీశ్వర్, ముజీబ్ హుస్సేని తదితరులు

అబిడ్స్: అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి వద్ద అన్నదానం నిర్వహించారు. సోమవారం దాదాపు 1000 మంది రోగుల సహాయకులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, సెంట్రల్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్, ఎం.సత్యనారాయణ గౌడ్, పర్వతాలు ముజీబ్ హుస్సేన్‌తో కలిసి అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, ఇతర నాయకులు ఖలీల్ అహ్మద్, వైదిక్ శాస్త్రి, ముకీమ్ ఖురేషి, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి యూనిట్ అధ్యక్షుడు బి.శివకుమార్, చంద్రశేఖర్, వహీద్, ముస్తఫా, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

వరదనీటిని ఎప్పటికప్పుడు తొలగించాలి



గచ్చిబౌలి: వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ వాసుదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో హైడ్రా, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. హైడ్రా బృందాలతో ఇంజనీరింగ్ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, ఆర్సీపురం, పటాన్‌చెరు సర్కిళ్లలో వర్షం వచ్చినప్పుడు ప్రధాన రహదారులపై భారీగా వరద చేరుతుందని తెలిపారు. నిర్దేశించిన ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు పర్యవేక్షిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, ఉప కమిషనర్లు, ఈఈలు, హైడ్రా అధికారులు పాల్గొన్నారు.

సబ్జిమండి ఉమ్మడి ఆలయాల అధ్యక్షుడిగా శ్రీనివాస్



జియాగూడ: సబ్జిమండి ఉమ్మడి ఆలయాల అధ్యక్షుడిగా దొర్నల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి నటరాజ్‌నగర్ నల్ల పోచమ్మ, సబ్జిమండి మహంకాళి ఆలయాల సభ్యుల సమావేశంలో శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సబ్జిమండి ఉమ్మడి ఆలయాల బోనాల ఉత్సవాలను 103 ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సారి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి కృషి చేస్తామన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సంస్కృతిక, సంప్రదాయాలను కాపాడుకోవాలని కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాల చారి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో గ్లోబల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో జయహో తెలంగాణ పేరిట తెలంగాణ అవతరణ దినోత్సవం, ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత యువత టీవీ, సినిమా మోజులో పడి మన సంస్కృతిని మర్చిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి యువత శాస్త్రీయ సంగీత కళల్లో ప్రోత్సహించాలని తల్లిదండ్రులను కోరారు. అంతకు ముందు వివిధ అంశాలపై కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చకిలం అసోసియేట్ ఎండీ చకిలం సుధాకర్, నటులు గద్దం నవీన్, పటాస్ ప్రవీణ్, సంస్థ నిర్వాహకులు లయన్ కేవీ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని దక్షిణ మండలం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం..రాజన్నబావి ప్రాంతానికి చెందిన పోసాని విజయ్‌కుమార్ ముదిరాజ్ ఇంట్లో ఆదివారం రాత్రి కొందరు పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్, ఛత్రినాక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో విజయ్ కుమార్‌తో పాటు సి.రాజేందర్ యాదవ్, హన్సరాజ్, అంబదాస్, రమాకాంత్, హరీశ్వర్ సింగ్, జగన్ చారి, అశోక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.81,600లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న

చార్మినార్: ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న సూచించారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో చాంద్రాయణగుట్ట సర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫలక్‌నుమా సర్కిల్‌లోని రోడ్డు ఆక్రమణ, చాంద్రాయణగుట్ట సర్కిల్‌లోని విద్యుత్ స్తంభం తొలగింపు, సంతోష్‌నగర్ సర్కిల్ చెందిన ఫుట్‌పాత్ ఏర్పాటుపై మొత్తం మూడు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ మురుగు సమస్య, రోడ్లు, వీధి దీపాలు ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ డి.శంకర్ సింగ్, ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, ఏఎంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సీపీ మహమ్మద్ అబ్దుల్ మజీద్, మలేరియా ఎస్ఈ నామాల శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, చార్మినార్, ఫలక్ నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల టౌన్ ప్లానింగ్ ఏసీపీలు రాందాస్, మెహ్రా, శ్రీధర్, వెటర్నరీ సీనియర్ అసిస్టెంట్ హమీద్, బిల్ కలెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాల పరిశీలన



వరద ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ జితేంద్ర, అధికారులు

గౌలిపురా: వర్షాకాలం నేపథ్యంలో గౌలిపురా డివిజన్‌లోని వరద ముంపు ప్రాంతాలను సోమవారం మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. చిన్నపాటి వర్షానికే లోతట్టు ప్రాంతాలైన ఛత్రినాక, అచ్చయ్యనగర్, హనుమాన్‌నగర్, పటేల్‌నగర్, అంబికానగర్ బస్తీలు పూర్తిగా జలమయమవుతాయని అధికారులకు జితేంద్ర వివరించారు. లోతట్టు ప్రాంతాలను అధికారులు పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటారన్నారు. అధికారులు మరోసారి వరద ముంపు ప్రాంతాలను పరిశీలించి నివేదికను అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ మహేశ్వర్ రెడ్డి, ఇన్‌చార్జి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ లింగం, నాయకులు జమాల్‌పూర్ అశోక్, రఘుకాంత్, పండరీనాథ్, శ్రీధర్, సాయికుమార్ పాల్గొన్నారు.

మెహిదీపట్నం డిపోలో 'గ్రాండ్ మండే ఛాలెంజ్'

లంగర్‌హౌస్: గ్రాండ్ మండే ఛాలెంజ్‌ను పురస్కరించుకొని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో నిర్దేశించిన టార్గెట్ ఎర్నింగ్ ఈపీకేను సాధించిన డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హైదరాబాద్ రీజనల్ మేనేజర్ సుధాపరిమళ సోమవారం మెహిదీపట్నం డిపోను సందర్శించారు. ఇందులో భాగంగా డ్రైవర్లు, కండక్టర్లను ప్రోత్సహించడానికి పలు బహుమతులు అందజేశారు. మెట్రో డిలక్స్ సర్వీసు బస్సుల్లో ఉద్యోగం చేస్తున్న వారికి హ్యాండ్ మైక్స్‌ను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.వి.కృష్ణమూర్తి, అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ సిబ్బందికి బహుమతులు అందజేస్తున్న సుధాపరిమళ

టోలిచౌకీలో సబ్‌స్టేషన్ ప్రారంభం



సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్

లంగర్‌హౌస్: ప్రజలకు విద్యుత్ కోతలు లేకుండా సక్రమంగా విద్యుత్ అందించడానికి నూతనంగా సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ పరిధిలోని 33 కేవీ హకీంబాబా సబ్‌స్టేషన్ ఫీడర్‌ను ఈ సందర్భంగా ప్రారంభించామన్నారు. ప్రస్తుతం హకీంపేట్, బీఎస్ఎన్ఎల్, హకీంషా, పారమౌంట్ ఫీడర్ అందుబాటులో ఉండగా, నూతనంగా హకీంబాబా ఫీడర్ అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తాం



డీహెచ్ రవీంద్రనాయక్‌ను కలిసిన డీఎంహెచ్ఎస్ యూనిట్ నూతన కార్యవర్గం

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలోని ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని టీఎన్జీఓస్ డీఎంహెచ్ఎస్ యూనిట్ అధ్యక్షుడు దేవదాస్ అన్నారు. సోమవారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ డాక్టర్ రవీంద్ర నాయక్‌ను నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా దేవిదాస్ మాట్లాడుతూ.. డీఎంహెచ్ఎస్ యూనిట్‌లోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్, డీఎంఈ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు తదితర శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ సహకారంతో ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ డీఎంహెచ్ఎస్ యూనిట్ ప్రధాన కార్యదర్శి కాజీపేట హరి, కోశాధికారి క్రాంతి కిరణ్, వైస్ ప్రెసిడెంట్ బి.చంద్రశేఖర్, రఘువీర్ సింగ్, దుర్గాభవాని, జాయింట్ సెంక్రెటరి సాయి అవినాష్, జయకుమార్, భరత్‌కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో పాతబస్తీ విద్యార్థుల సత్తా



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కోచ్ హబీబ్ ముస్తఫా

చార్మినార్: పాతబస్తీలోని హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీకి చెందిన నలుగురు విద్యార్థులు బాక్సింగ్‌లో నాలుగు బంగారు పతకాలను సాధించారు. నిజామాబాద్‌లో జరిగిన బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలను సాధించిన విద్యార్థులను కోచ్ హబీబ్ ముస్తఫా సోమవారం అభినందించారు. నిజామాబాద్‌లో జరిగిన అండర్-17 విభాగంలో 6వ జూనియర్ రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్-2025 కోసం హైదరాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహించారు. ఇక ఈ నలుగురు విద్యార్థులు ఈ నెల 19 నుంచి 25 వరకు హరియాణాలో జరగనున్న జూనియర్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్-2025లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారని కోచ్ తెలిపారు. 52-54 కేజీల విభాగంలో మీర్జా అలీ బేగ్, 63-66 కేజీల విభాగంలో సయ్యద్ ఒబైద్ ఉద్దీన్, 66-70 కేజీల విభాగంలో సయ్యద్ ఫసి ఉర్ రెహమాన్, 80-85 కేజీల విభాగంలో సయ్యద్ వాసే హుస్సేన్ తదితరులు నిజామాబాద్‌లో బంగారు పతకాలను సాధించారన్నారు. హరియాణాలో జరగనున్న పోటీల్లో పాల్గొనడానికి ఈనెల 17న వీరంతా హైదరాబాద్ నుంచి హరియాణాకు వెళ్లనున్నారు.

యువ ప్రతిభా ప్రోత్సాహక అవార్డుల ప్రదానం



పురస్కార గ్రహీతలతో డాక్టర్ గురువారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: మన యువతే దేశ భవిష్యత్తు అని వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాల్సిన అవసరం ఎంతగానో ఉందని పలువురు వక్తలు అన్నారు. సోమవారం ఆదర్శనగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో పర్ణశాల సంస్థ ఆధ్వర్యంలో పర్ణశాల యువ ప్రతిభ ప్రోత్సాహక అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యుడు డాక్టర్ గురువారెడ్డి మాట్లాడుతూ..అవార్డులు ప్రోత్సాహాన్ని ఇవ్వడంతో పాటు ఇతరుల్లో స్ఫూర్తిని రగిలిస్తాయని తెలిపారు. ఈ తరహా అవార్డులు యువతకు కొత్త ఆశ, దిశలు అందిస్తాయని ప్రశంసించారు. సంస్థ నిర్వాహకులు డాక్టర్ ధీరజ్ అచ్యుతుని మాట్లాడుతూ..యువ ప్రతిభా ప్రోత్సాహక అవార్డులు వారి ప్రగతికి ఒక చిన్న చుక్కగా నిలుస్తాయని నమ్ముతున్నట్లు తెలిపారు. ప్రకృతి సిద్ధమైన, నాణ్యమైన మసాల దినుసులను ప్రజలకు అందించడమే లక్ష్యంగా నూతన ఈ కామర్స్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అంతకు ముందు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పురస్కార గ్రహీతలు కడలి సత్యనారాయణ, ప్రియాంక బార్దే, వివేక్‌సాగర్, హోమేష్ తదితరులు పాల్గొన్నారు.